## ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 02-11-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) చేపట్టిన సీఎంఎస్-03 ఉపగ్రహ ప్రయోగం విజయవంతమయింది.
- శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ ఘటనలో మృతి చెందిన కుటుంబాలకు ప్రభుత్వం ప్రకటించిన ఆర్థిక సహాయాన్ని మంత్రులు ఈరోజు అందజేశారు.
- నీటి సంరక్షణలో రాష్ట్రాన్ని ముందంజలో నిలిపేందుకు కృషి చేస్తున్నామని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు.
- మహిళల వన్డే క్రికెట్ ప్రపంచ కప్ ఫైనల్ మ్యాచ్ భారత్, దక్షిణాఫ్రికా జట్ల మధ్య నవీ ముంబయి డివై పాటిల్ స్టేడియం వేదికగా ప్రారంభమైంది.

=======================

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) చేపట్టిన 'సీఎంఎస్-03' ఉపగ్రహ ప్రయోగం విజయవంతమైంది. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ షార్‌లోని రెండో ప్రయోగ వేదిక నుంచి దీన్ని ఈ రోజు ప్రయోగించారు. 'సీఎంఎస్-03' ఉపగ్రహాన్ని 'ఎల్‌వీఎం3-ఎం5' వాహక నౌక విజయవంతంగా మోసుకెళ్లింది. ఉపగ్రహ ప్రయోగం విజయవంతం కావడంపై ఇస్రో ఛైర్మన్ వి. నారాయణన్ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ విజయంలో కీలక పాత్ర పోషించిన వారికి అభినందలు తెలిపారు.

=======================

నీటి సంరక్షణలో రాష్ట్రాన్ని ముందంజలో నిలిపేందుకు కృషి చేస్తున్నామని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయమంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. గుంటూరు రూరల్ మండలం వెంగళాయపాలెంలోని చెరువును మంత్రి ఈ రోజు పరిశీలించారు. నీటి సంరక్షణకు సంబంధించి వెంగళాయపాలెంలోని చెరువును పైలట్ ప్రాజెక్టుగా చేపడుతున్నట్లు తెలిపారు. ఈ నెల 10, 11వ తేదీలలో గుంటూరులో జరగనున్న జాతీయ స్థాయి వాటర్ షెడ్

కాన్ఫరెన్స్ లో ఈ పైలట్ ప్రాజెక్టును ప్రదర్శిస్తామన్నారు. రాష్ట్రంలోని మరిన్ని చెరువులకు కేంద్ర ప్రభుత్వ నిధులు తెచ్చేందుకు కృషి చేస్తున్నామని పెమ్మసాని చంద్రశేఖర్ తెలియజేస్తూ...

(వాయిస్ 32 సెకన్లు)

========================

శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలోని వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో తొక్కిసలాట ఘటనలో మృతి చెందిన కుటుంబాలకు ప్రభుత్వం ప్రకటించిన ఆర్థిక సహాయాన్ని పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఈ రోజు అందించారు. టెక్కలి మండలం పిట్టలసరియా, రామేశ్వరం, నందిగం మండలం శివరాంపురం గ్రామాల్లోని మృతుల కుటుంబాల ఇళ్లకు వెళ్ళి పరామర్శించారు. ప్రభుత్వం తరఫున 15 లక్షల రూపాయల చెక్కులను అందించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ... భవిష్యత్ లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. త్వరలో కేంద్ర ప్రభుత్వం నుండి మరో రెండు లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందుతుందని కేంద్రమంత్రి కె. రామ్మోహన్ నాయుడు తెలిపారు.

========================

గంజాయి రవాణా, విక్రయాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) హరీశ్ కుమార్ గుప్తా అన్నారు. విశాఖ జిల్లాలో 5 కోట్ల రూపాయల విలువ చేసే గంజాయి, హాష్ ఆయిల్‌ను పోలీసులు కాపులుప్పాడ డంపింగ్ యార్డులో ఈ రోజు ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా పాత్రికేయుల సమావేశంలో డీజీపీ మాట్లాడుతూ... గంజాయి కేసులో అరెస్టు అయిన వారి ఆస్తులను జప్తు చేస్తామన్నారు. విశాఖపట్నం పోలీస్ కమీషనర్ శంఖబ్రత భాగ్చి మాట్లాడుతూ... గంజాయిని అరికట్టేందుకు 8 చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని చెప్పారు. ఛత్తీస్‌గఢ్, ఒడిశా నుంచి వచ్చే బస్సులు, రైళ్లను విస్తృతంగా తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. 15 నెలల్లో 14 వేల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రతి కళాశాలలో ఈగల్ టీమ్స్ చురుగ్గా పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు.

విరామం

========================

వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు ఆర్థిక సహాయాన్ని 10 వేల రూపాయల నుండి 20 వేల రూపాయాలకు పెంచి ఇచ్చామని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా యలమంచిలి మండలంలో మొంథా తుఫాను కారణంగా నష్టపోయిన లక్ష్మీపాలెం, గంగడపాలెం గ్రామాల్లో మంత్రి ఈ రోజు పర్యటించారు. మత్స్యకార కుటుంబాలకు నిత్యవసర సరకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... మొంథా తుఫాను ప్రభావంతో పలు జిల్లాల్లో తీరని నష్టం కలిగిందన్నారు. తుఫాను తీరం దాటిన మరుసటి రోజు నుంచే బాధితులకు సహాయం అందిస్తున్నామని తెలిపారు.

========================

ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీలను Meekosam.ap.gov.in వెబ్ సైట్ లోనూ నమోదు చేయవచ్చని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎన్. ప్రభాకర రెడ్డి ఈ రోజు ఒక ప్రకటనలో తెలిపారు. రేపు జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజల వినతులను స్వీకరించడం జరుగుతుందన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రతి రోజూ ప్రజల నుంచి వినతులు స్వీకరించేందుకు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నమోదైన అర్జీల స్థితి, దానికి సంబంధించిన సమాచారం కోసం 1100 ఫోన్ నంబర్ ను సంప్రదించ వచ్చునని సూచించారు.

========================

ఆంధ్రప్రదేశ్ లోని దిగువ ట్రోపో ఆవరణంలో వాయువ్య దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని వాతావరణ కేంద్రం తెలిపింది. రాష్ట్రంలో రాగల మూడు రోజుల వరకు వాతావరణ సూచనలను వాతావరణ శాఖ అధికారి బి. శేఖర్ తెలియజేస్తూ...

(వాయిస్ 20 సెకన్లు)

========================

మహిళల వన్డే ప్రపంచ కప్ తుది అంకానికి చేరుకుంది. భారత్, దక్షిణాఫ్రికా జట్ల మధ్య నవీముంబయి లోని డీవై పాటిల్ స్టేడియం వేదికగా ఫైనల్ క్రికెట్ మ్యాచ్ కొద్ది సేపటి క్రితం ప్రారంభమైంది. టాస్ గెలిచిన దక్షిణాఫ్రికా బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ ప్రారంభించిన భారత్ 12 ఓవర్లు పూర్తయే సరికి వికెట్ నష్టపోకుండా 69 పరుగులు చేసింది. ఇక పురుషుల క్రికెట్ లో టీ-20 సిరీస్ లో భాగంగా ఆస్ట్రేలియా భారత్ జట్ల మధ్య మూడవ క్రికెట్ మ్యాచ్ హోబార్ట్ వేదికగా జరిగింది. ఈ మ్యాచ్‌లో భారత్ 5 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఆస్ట్రేలియా నిర్దేశించిన 187 పరుగుల లక్ష్యాన్ని భారత్ 18.3 ఓవర్లలనే ఛేదించింది. భారత ఆటగాళ్లలో అత్యధికంగా వాషింగ్టన్ సుందర్ 49 పరుగులు, తిలక్ వర్మ 29 పరుగులతో రాణించారు. ఈ విజయంతో ఐదు టీ20 మ్యాచ్‌ల సిరీస్‌ను భారత్ 1-1 తో సమం చేసింది.

========================

కైశిక ద్వాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ఈ రోజు ఆస్థానం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజామున శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ఉగ్ర శ్రీనివాసమూర్తి ఆలయ మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. వేంకటతురైవార్, స్నపనబేరంగా పిలిచే ఈ ఘట్టాన్ని నిర్వహించిన అనంతరం స్వామి, అమ్మవార్లను బంగారు వాకిలి చెంత వేంచేపు చేసి అర్చకులు పురాణ పఠనంతో కైశిక ద్వాదశి ఆస్థానాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

========================

అవినీతికి వ్యతిరేకంగా పోరాడేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని యాంటీ కరప్షన్ బ్యూరో (ఏసీబీ) డైరెక్టర్ జనరల్ అతుల్ సింగ్ అన్నారు. విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో సైకిల్ ర్యాలీని ఆయన ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... అవినీతిపై ప్రజల్లో దేశవ్యాప్తంగా అవగాహన కల్పించేందుకు సైకిల్ ర్యాలీని చేపట్టామన్నారు. సమాజ అభివృద్ధికి.. అవినీతి అవరోధంగా ఉందని, దానిపై పోరాటం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు.

========================

కాశీబుగ్గ ఘటనలో మృతుల కుటుంబాల బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని రాష్ట్ర దేవదాయ, ధర్మదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. కాశీబుగ్గ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో తొక్కిసలాట జరిగిన ప్రాంతాన్ని మంత్రి ఈ రోజు పరిశీలించారు.

========================
========================